క్లుప్తంగా

అర్హులంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు సిటీ: ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శేషుబాబు సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక మంగమూరు రోడ్డులోని నాగార్జున డిగ్రీ కాలేజీలో ఓటుహక్కుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన వారంతా తప్పనిసరిగా ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు.

అనాధలకు అన్నదానం, పుస్తకాల పంపిణీ

ఒంగోలు సిటీ: స్థానిక బొమ్మరిల్లు అనాధాశ్రమంలోని పిల్లలకు బుధవారం అన్నదానం చేసి పుస్తకాలు అందజేశారు. ముద్దన తిరుపతి రాయుడు జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌కు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్



బసవన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌కు లభించిన ఎన్‌క్వాస్ సర్టిఫికెట్

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌కు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ లభించింది. నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గత నెల 12వ తేదీ నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్వాస్) టీం సభ్యులు వర్చువల్‌గా బసవన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. సెంటర్ పరిసరాలను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మందులు అమర్చిన తీరు, రికార్డులు పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడి అభిప్రాయాలు స్వీకరించారు. 83 శాతం మార్కులు సాధించడంతో బసవన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌కు ఎన్‌క్వాస్ సంస్థ నుంచి గుర్తింపు పత్రాన్ని విడుదల చేశారు. దీంతో బుధవారం మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్లు శ్రావణ్ కుమార్, ఆనందమోహన్, వినీల చౌదరి, వైద్య శాఖ సిబ్బంది వెల్‌నెస్ సెంటర్ సిబ్బందిని అభినందించారు.

గుండ్లాపల్లి పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

మద్దిపాడు: జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ బుధవారం మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాల కోసం కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ఆహ్వాన పత్రికలను పరిశీలించి అభినందించారు. పాఠశాలలో జరుగుతున్న ఇతర పథకాలైన ఒకేషనల్, పాల్ ల్యాబ్ గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పనితీరు బాగుందని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను అభినందించారు. డీఈఓ వెంట డీసీఈబీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

7న పేరెంట్స్‌తో ప్రత్యేక మెగా సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ నెల 7వ తేదీ ప్రత్యేక మెగా సమావేశాలు నిర్వహించాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్ బాబు ఆదేశించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, హైస్కూల్ హెచ్‌ఎంలు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల ప్రోగ్రెస్, సహపంక్తి భోజనాలు, పలు పోటీలు, తదితర కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో నిర్వహించాలన్నారు. సమావేశంలో ఒంగోలు డిప్యూటీ డీఈఓ ఏ చంద్రమౌళేశ్వర్, ఎంఈఓ డి.వెంకారెడ్డి, సర్వ శిక్షా అభియాన్ ఇన్‌చార్జి సీఎంఓ బీపీ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయం.. సేవలు నిర్వీర్యం..!

- చీమకుర్తి మండలంలో సచివాలయాల ద్వారా సక్రమంగా అందని సేవలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయాల సేవలకు మంగళం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 545 రకాల సేవలు అందించిన సచివాలయాలు
- ప్రస్తుతం కూటమి ప్రభుత్వ తీరుతో ప్రజల అసహనం



చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెం గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలు

చీమకుర్తి రూరల్: గ్రామాల్లోనే ప్రజలకు అన్నిరకాల సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. వాటికి అనుసంధానంగా వలంటీర్లను నియమించి ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే అందించారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను కూడా ఏర్పాటు చేసి సచివాలయాలకు అనుసంధానం చేసి సుమారు 545 రకాల సేవలను సచివాలయాల ద్వారా ప్రజలకు చేరువ చేశారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనే లక్ష్యంగా అడుగులు వేశారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల వ్యవస్థను, వాటి సేవలను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే వలంటీర్లను పక్కనపెట్టేసింది. సచివాలయ ఉద్యోగులను కించపరిచేలా విధులను అప్పగిస్తోంది. సచివాలయాల్లో అందే సేవలన్నీ నిలిచిపోయేలా చేస్తోంది. దీంతో చీమకుర్తి మండలంలో ఉన్న 17 సచివాలయాల ద్వారా ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదు. మండలంలోని సచివాలయాల్లో 102 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఏ విధమైన సేవలూ అందకపోతుండటంతో మండల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లోని సచివాలయాల్లో సేవలు నిలిపివేయడంతో చీమకుర్తి మండలంలోని గ్రామాల ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సచివాలయాల ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయిస్తూ కూటమి ప్రభుత్వం ఇంటింటికీ తిప్పుతోంది. వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటి ప్రచారం చేపట్టి సచివాలయ ఉద్యోగులతో స్టిక్కర్లు పంపిణీ, ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించే పనులు చేయించింది. చివరకు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించే పనులను కూడా సచివాలయ ఉద్యోగులతో చేయించడంతో వారంతా అవమానకరంగా భావించారు. ప్రస్తుతం కూడా జియో ట్యాగింగ్ సర్వే పేరుతో సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తిప్పుతోంది. గత ప్రభుత్వంలో 545 రకాల సేవలను సచివాలయాల ద్వారా అందించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవన్నీ నిలిపివేసి వలంటీర్లు చేసే పనులను తమతో చేయించడంపై సచివాలయాల ఉద్యోగులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లోనే అన్నిరకాల సేవలు పొందిన ప్రజలు ప్రస్తుతం మండల కార్యాలయానికి తిరుగుతూ అవస్థపడుతున్నారు. జననమరణ ధ్రువీకరణ పత్రాలు తప్ప మరే పథకానికి సంబంధించిన దరఖాస్తులూ సచివాలయంలో ఇవ్వడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస స్థలాలు తదితర పథకాలు, సేవలకు సంబంధించిన వెబ్‌సైట్లు సచివాలయాల్లో ఓపెన్ కావడం లేదని వాపోతున్నారు. దీంతో మళ్లీ మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల్లో సేవలందక ప్రజలకు అవస్థలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా సంక్షేమ పథకాల ఊసేలేదు. దానికితోడు సచివాలయాల ద్వారా గత ప్రభుత్వం అందించిన సేవలన్నీ నిలిపివేయడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సచివాలయాల్లోనే ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పెరికల నాగేశ్వరరావు, సర్పంచ్, మంచికలపాడు, చీమకుర్తి మండలం

సచివాలయాల సేవలను పునరుద్ధరించాలి



గత ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా ఎన్నో సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. అవసరాల నిమిత్తం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్లే ప్రతి ఇంటికీ వెళ్లి అవసరమైన పత్రాలు స్వీకరించి సంక్షేమ పథకాల నగదు బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో సేవలేమీ అందడం లేదు. ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉన్న సచివాలయాలను, వాటి సేవలను నిర్వీర్యం చేయడం మంచి పద్ధతి కాదు. కూటమి ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందించాలి.

– కూదలి మాలకొండయ్య, పాటిమీదపాలెం, చీమకుర్తి మండలం

ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు



చీమకుర్తిలో ఘంటసాలకు నివాళులర్పిస్తున్న మాధవరావు, విద్యార్థులు



ఒంగోలులో ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కవులు, కళాకారులు, గాయకులు



మద్దిపాడులో ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు

ఒంగోలు మెట్రో: తన అజరామరమైన గాత్రంతో తెలుగు పాటను సుసంపన్నం చేసిన గానగంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు కొనియాడారు. పద్మశ్రీ ఘంటశాల, ఎస్వీ రంగారావు సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘంటశాల జయంతిని స్థానిక సీవీఎస్ రీడింగ్ రూం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి కళాకారులు, గాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ నిర్వాహకులు ఆకుల శ్రీనివాసరావు, వి.కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొన్నూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు వేలకుపైగా గీతాలను ఘంటసాల ఆలపించడమే కాకుండా భగవద్గీతలోని శ్లోకాలను ఆలపించి అఖండ ఖ్యాతిని పొందారన్నారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించటమే కాకుండా తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన సంగీత విద్వాంసులుగా ఘంటసాలను నియమించిందన్నారు. స్వాతంత్ర్య పోరాటం సమయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో 18 నెలలు జైలు జీవితాన్ని అనుభవించి స్వాతంత్ర్య సమరయోధునిగా కూడా ఘంటసాల కీర్తి గడించారన్నారు. గాయనీ గాయకులు పెండ్యాల సాయిమాస్టర్, ఎన్నూరు నాగేశ్వరరావు, ఐ.మురళీకృష్ణ, మా మూర్తి, చల్లా నాగేశ్వరరావు, ఓరుగంటి ప్రసాద్, యు.కోటేశ్వరరావు, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, మిఠాయిలు పంచిపెట్టారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని మద్దిపాడు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు స్థానిక నటరాజ కళా కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పాడిన మధుర గీతాలను మరో మారు విని ఆనందించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, మండల కో ఆప్షన్ సభ్యుడిగా పనిచేసిన మజీద్ మాస్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కటకం రామారావు అబ్దుల్ కలాం, సత్యనారాయణ, నరసింహారావు, కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా చీమకుర్తిలోని ఆయన విగ్రహానికి అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తిలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూల్లో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గోపురపు చంద్ర, పీ రవీంద్ర, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయండి



ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తున్న ఏపీడీ వెంకటస్వామి

సంతనూతలపాడు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీడీ పాలేటి వెంకటస్వామి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన గోకులాల షెడ్లను వెంటనే ప్రారంభించి గ్రౌండింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మండలానికి కేటాయించిన ఫారం పాండ్లు, సోక్‌పిట్లు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలకు సంబంధించిన అన్ని పనులను ప్రారంభించాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ గ్రామసభలు నిర్వహించి చేయాల్సిన పనులను గుర్తించాలని తెలిపారు. సోషల్ ఆడిట్‌కి రికార్డులన్నీ సిద్ధం చేసుకోవాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీలేకుండా ఎటువంటి లోపాలు, అవినీతికి తావులేకుండా పనులు పూర్తిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో కే వాసంతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

300 మందికి అన్నదానం, వస్త్రాల పంపిణీ



వస్త్రాలు పంపిణీ చేస్తున్న దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ దంపతులు, ట్రస్ట్ సభ్యులు

సంతనూతలపాడు: మండల కేంద్రంలో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం 300 మంది పేదలకు అన్నదానం చేసి వస్త్రాలు అందించారు. సంతనూతలపాడు మండల జెడ్పీటీసీ దుంపా రమణమ్మ జన్మదినంతో పాటు దుంపా ఇంద్రసేనారెడ్డి, దివ్యజ్యోతి, ట్రస్ట్ సభ్యులు శీలం మల్లారెడ్డి, రామతులసి వివాహ వార్షికోత్సవాల సందర్భంగా కేక్ కట్ చేసి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంతనూతలపాడులోని వెల్లంపల్లి సత్యనారాయణగూడెం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి దంపతులను సత్కరించారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో గత 28 వారాల నుంచి ప్రతి బుధవారం దాతల సహకారంతో పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడంగుంట విజయ, సర్పంచ్ దర్శి నాగమణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, ట్రస్ట్ సెక్రటరీ చివుకుల రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు శీలం మల్లారెడ్డి, కొప్పోలు శ్రీనివాసరావు, శిఘాకొల్లి ధనలక్ష్మి, బి.సుధారాణి, ఎస్.శ్రీనివాసరావు, వేమా నాగరాజు, అట్లూరి జాన్‌బాబు, తన్నీరు నాగేశ్వరరావు, దాచర్ల శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

పల్లెవెలుగు సర్వీసుల్లో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్



ఒంగోలు డిపో మేనేజర్ కార్యాలయంలో డ్రా తీస్తున్న డీఎం

ఒంగోలు సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీ ఒంగోలు డిపో పరిధిలో పల్లెవెలుగు సర్వీసుల్లో ప్రయాణించే వారికి ప్రోత్సాహంగా పొందూరు, తాళ్లూరు, గుండాయపాలెం, కొణిజేడు రూట్లలో గిఫ్ట్ స్కీమ్ అమలు చేస్తున్నట్లు డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ డిపో కార్యాలయంలో డ్రా తీసినట్లు చెప్పారు. డ్రాలో గెలుపొందిన తెల్లబాడుకు చెందిన బి.శ్రీరామమూర్తి, కొణిజేడుకు చెందిన డి.కోమలేశ్వరి, గుండాయపాలేనికి చెందిన అనూరాధలకు డిపో కార్యాలయంలో సంప్రదించి బహుమతులు తీసుకెళ్లాలని కోరారు. ఈ బహుమతులను సీఎంఆర్ జ్యువెల్లరీ అధినేత మావూరి శ్రీనివాసరావు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్.ఎం.నాయక్, వై.ప్రభాకర్, వై.హనుమంతరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కొత్తపట్నం: రైతులు భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ నెల 6 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి ఆన్‌లైన్, పేర్లు తప్పులు, పొలంలో హెచ్చుతగ్గులు సరిచేసుకోవడం, భూమి రికార్డుల్లో ఉంటే సరిచేసుకోవడం వంటివి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు ఉంటాయన్నారు. 6వ తేదీ ఆలూరులో, 7న గాదెపాలెం, వజ్జిరెడ్డిపాలెంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గమళ్లపాలెంలో, 12న కె.పల్లెపాలెం, 17న అల్లూరు, 19న కొత్తపట్నం, 21న రాజుపాలెం, 23న ఈతముక్కల, 27న సంకువారిగుంట, 28న మడనూరు, 30న గుండమాల, జనవరి 2న ఉదయం పిన్నివారిపాలెం, మధ్యాహ్నం బీరంగుంట, 4న మోటుమాల, 6న పాదర్తి, జనవరి 8 రంగాయపాలెంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

క్రిస్మస్ సందర్భంగా ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పాస్టర్ డీజే అగస్టీన్

ఒంగోలు మెట్రో: క్రిస్మస్ పండుగ సందర్భంగా ఒంగోలు జేఎంబీ చర్చి సండే స్కూలు టీచర్లు, హెల్పర్లకు ఆటల పోటీలను బుధవారం ఘనంగా నిర్వహించారు.రెవరెండ్ పాస్టర్ డీజే అగస్టీన్, పాస్టర్ ఆషేర్ పాల్ ఉదయం ప్రార్థన చేసి ఆటల పోటీలను ప్రారంభించగా, సంఘ సెక్రటరీ తెలగతోటి సుమతి, ట్రెజరర్ తాడిపర్తి పవిత్రన్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని సండే స్కూల్ టీచర్లు, హెల్పర్లకు వినోద క్రీడలు, బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పకు పవిత్రోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి



కలశాలతో అర్చకులు, దీక్షధారులు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరుడొంక అయ్యప్పస్వామి క్షేత్రంలో వార్షిక పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఐదు గంటలకు మంగళ ధ్వని, సుప్రభాత సేవ, ప్రాతఃకాల హారతి, నిత్యారాధనము, ఎనిమిది గంటలకు విష్వక్సేనారాధాన, పుణ్యాహవాచనం, నిత్య హోమం, బలిహరణ, అష్టోత్తర కలశ స్థాపన, ఆవాహన అర్చనము, స్వామివారికి ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర నుంచి 108 కలశాల జలముతో అభిషేకం, అలంకరణ, మహా మంగళ హారతిని వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు శాస్త్ర భూషణ డాక్టర్ భావనారాయణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు దీక్షధారులు పాల్గొన్నారు.

క్యాటిల్ షెడ్ నిర్మాణాలు పూర్తి చేయాలి

- ద్వామా పీడీ జోసఫ్ కుమార్



పెద్దకొత్తపల్లిలో క్యాటిల్ షెడ్‌ను పరిశీలిస్తున్న ద్వామా పీడీ జోసఫ్ కుమార్, ఎంపీడీవో, ఏపీవో

మద్దిపాడు: మండలంలోని అన్ని క్యాటిల్ షెడ్లను ఈ నెలాఖరిలోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని పెద్దకొత్తపల్లి, నరసయ్యపాలెం గ్రామాల్లో జరుగుతున్న షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీవోను ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణాల్లో కూడా ఉపాధి కూలీలకు వేజ్ కల్పించాలని ఎంపీడీవోకి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వి.జ్యోతి, ఏపీఓ ధనంజయవర్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిషోర్ కుమార్, షెడ్ల నిర్మాణదారులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో ఏటీఎం ప్రారంభం

నాగులుప్పలపాడు:

మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో ఏటీఎం సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. మూడేళ్లుగా గ్రామంలో ఏటీఎం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో ఏటీఎం ఏర్పాటు చాలా సంతోషకరమని సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్ తెలిపారు. నూతన ఏటీఎంను ప్రారంభించి ఆయన మాట్లాడారు.



నూతన ఏటీఎంను ప్రారంభిస్తున్న శ్యామ్యూల్

ఈ క్రాప్‌లో పంటలు నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



దొడ్డవరంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



కొత్తపట్నం: పంటల బీమా గురించి వివరిస్తున్న ఏవో అజయ్ కుమార్

మద్దిపాడు: రైతులు ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా పంటలు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని దొడ్డవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ–క్రాప్‌లో పంట నమోదు చేయడం వలన పంట నష్టం జరిగితే పరిహారం అందుతుందన్నారు. తద్వారా రైతుకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌బాబు, ఎంపీడీవో వి.జ్యోతి ఈఓపీఆర్‌డీ రఘుబాబు, ఏవో కె.రమేష్ రైతు సేవా కేంద్రం సిబ్బంది స్పందన, శిరీష, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమాకు నగదు చెల్లించాలి...

అల్లూరు (కొత్తపట్నం): వివిధ రకాల పంటలకు బీమా సమయం ముగుస్తోందని, రైతులు వెంటనే ప్రీమియం చెల్లించాలని ఇన్‌చార్జి ఏవో సీహెచ్ అజయ్ కుమార్ సూచించారు. కొత్తపట్నం మండలంలోని అల్లూరు, చింతల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. వరి పంటకు డిసెంబర్ 31 చివరి తేదీగా ప్రకటించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు టీవీ నాగలక్ష్మి, మార్కెట్ శాఖ నుంచి కిషోర్, మత్స్యశాఖ నుంచి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి...

చీమకుర్తి రూరల్: పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడితే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని పల్లామల్లి, చంద్రపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. వరి పొలాలను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి పంటకు బీమా చేయించుకోవాలి...

నాగులుప్పలపాడు: రైతులు సాగు చేసే ప్రతి పంటకు బీమా తప్పకుండా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు సూచించారు. బుధవారం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పశుసంవర్థక శాఖాధికారి అనురాధ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.